

వెబ్‌సైట్‌లో టెన్త్ మార్కుల మెమోలు: డీఈవో

అనకాపల్లి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు సబ్జెక్టుల వారీగా పొందిన మార్కుల వివరాలు (షార్ట్ మెమోలు) పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని డీఈవో జి.అప్పారావునాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల లాగిన్ ద్వారా సబ్జెక్టుల వారీగా మెమోరాండాలను డౌన్‌లోడ్ చేసుకొని సంతకం చేసిన కాపీలను విద్యార్థులకు అందజేయాలన్నారు. వీటిల్లో ఏమైనా పొరపాట్లు వుంటే.. విజయవాడలోని ప్రభుత్వ పరీక్షల సంచాలకుల దృష్టికి ఈ నెల 25వ తేదీలోగా తీసుకువెళ్లాలని సూచించారు.

రైతుకు అండగా!

అన్నదాత సుఖీభవ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం

- కౌలుదారులకు, అటవీ భూముల హక్కు పత్రాలు ఉన్న రైతులకూ వర్తింపు
- ఏటా మూడు విడతల్లో రూ.20 వేలు సాయం
- వ్యవసాయ శాఖకు మార్గదర్శకాలు
- రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు
- ఈనెల 20వ తేదీ వరకే గడువు


దుక్కి దున్నుతున్న రైతు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు వున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నది. సూపర్ సిక్స్‌లో ఒకటైన 'ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం' హామీని అమలు చేసేందుకు సన్నద్ధమైంది. 'అన్నదాత సుఖీభవ' పథకం పేరుతో అర్హులైన రైతులకు మూడు విడతల్లో సాయం అందజేయనున్నది. ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమకానున్నాయి. జిల్లాలో ఈ ఏడాది సుమారు రెండు లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందనున్నది.

అందరికీ అన్నం పెట్టే రైతులకు పెట్టుబడి నిధి కింద ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి రైతుకు ఏడాదిలో మూడు విడతలుగా రూ.20 వేల సాయం అందించనుంది. ఈ పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలు జిల్లా వ్యవసాయ శాఖాధికారులకు జారీ కావడంతో లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. భూమి ఉన్న రైతులతోపాటుకౌలు రైతులకు, అటవీ భూములపై హక్కులున్న వారికి కూడా 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం 'పీఎం కిసాన్' పేరుతో ఒక్కో రైతుకు ఏటా మూడు విడతల్లో రూ.6 వేలు అందిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు అందిలా చర్యలు చేపట్టింది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల వివరాలను పరిశీలించి, అర్హుల జాబితాలను రూపొందిస్తున్నారు. అర్హుల జాబితాను ఈ నెల 20వ తేదీలోగా వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నారు.

మార్గదర్శకాలు

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. భార్య, భర్త, అవివాహితులను ఒక కుటుంబంగా పరిగణిస్తారు. వ్యవసాయ, ఉద్యాన పంటలతోపాటు మల్బరీ (పట్టు) తోటలు సాగు చేసేవారు కూడా ఈ పథకానికి అర్హులే. ప్రస్తుత లేదా మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జడ్పీ చైర్మన్లు వంటి రాజ్యాంగబద్ధ పదవుల్లో వున్న వారికి ఈ పథకం వర్తించదు. ఇంకా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసేవారు, స్థానిక సంస్థల్లో శాశ్వత ప్రాతిపదికన పనిచేసే వారు కూడా పథకానికి అర్హులు కారు. నెలకు రూ.10 వేలు అంతకు మించి పెన్షన్ తీసుకొనే వారికి కూడా ఈ పథకం వర్తించదు. ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్టులు, ఇతర వృత్తి నిపుణులు అనర్హులు. గత ఏడాది ఆదాయ పన్ను చెల్లించిన వారు ఈ పథకం కింద లబ్ధి పొందలేరు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చినా కూడా ఈ పథకం వర్తించదు. అర్హులై వుండి అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి పొందాలనుకొనే రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 వరకే గడువు ఉన్నందున రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లాలో రెండు లక్షల మందికిపైగా లబ్ధి

జిల్లాలో మొత్తం 4.2 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తారు. పీఎం కిసాన్ యోజన కింద ఈ-కేవైసీ పూర్తి చేసుకున్న 1,95,558 మందికి ఆర్థిక సాయం అందుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకం వీరందరికీ వర్తించనున్నది. అయితే పీఎం కిసాన్ యోజనలో కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వడంలేదు. వీరితోపాటు అటవీ హక్కు పత్రాలు ఉన్న రైతులకు కూడా పెట్టుబడి సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో లబ్ధిదారుల సంఖ్య రెండు లక్షలు దాటే అవకాశం వుంది. అనధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 80 వేల మందికిపైగా కౌలు రైతులు ఉన్నారని అంచనా. వీరిలో క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్ (సీసీఆర్‌సీ) ఉన్న కౌలు రైతులకు ఈ పథకం వర్తించే అవకాశం ఉంది. అటవీ హక్కు పత్రాలు పొంది పంటలు సాగు చేస్తున్న గొలుగొండ, నాతవరం, రోలుగుంట, రావికమతం, దేవరాపల్లి, మాడుగుల మండలాల్లోని గిరిజన రైతులకు కూడా ఈ పథకం కింద సాయం అందుతుంది. అయితే ఈ ప్రాంతాల్లో రెవెన్యూ, వ్యవసాయ, అటవీ శాఖల ఉమ్మడి ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక జరగనుంది. గ్రామస్థాయిలో వ్యవసాయ శాఖ సహాయకులు, వీఆర్‌ఓలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను ఎంపిక చేసి తుది జాబితాను ఆన్‌లైన్ అప్‌లోడ్ చేస్తారు. దీనిని మండల వ్యవసాయాధికారి, తహసీల్దారు ఆమోదిస్తే.. జిల్లా వ్యవసాయాధికారి పరిశీలించి వ్యవసాయ శాఖ కమిషనర్ వెబ్ పోర్టల్‌లో ఈ నెల 20 వ తేదీలోగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఆలయాలకు ధర్మకర్తల మండళ్లు

దరఖాస్తుకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు

- జిల్లాలో 16 ఆలయాలకు దేవదాయ శాఖ నోటిఫికేషన్



దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం

నర్సీపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దేవదాయ శాఖ పరిధిలో ఉన్న 16 ఆలయాలకు ధర్మకర్తల మండళ్ల ఏర్పాటు చేయడానికి దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు కోరుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దరఖాస్తుదారుని వయస్సు 30 సంవత్సరాలపైబడి ఉండాలని, ఇరవై రోజుల్లో జిల్లా దేవదాయ శాఖ అధికారికి దరఖాస్తులు అందజేయాలని ఈ నెల 6న విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నబ్బవరం మండలం సోమనాథపురంలోని సోమలింగేశ్వరస్వామి ఆలయం, అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలో సత్యనారాయణస్వామి ఆలయం, అనకాపలి పట్టణంలో జగన్నాథ స్వామి ఆలయం, భోగలింగేశ్వరస్వామి ఆలయం, కశింకోటలో సత్యనారాయణ స్వామి ఆలయం, చోడవరంలో వేంకటేశ్వరస్వామి ఆలయం, స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం, హార్డింగ్ రెస్ట్ హౌస్, బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో వేంకటేశ్వరస్వామి ఆలయం, రావికమతం మండలంలో కల్యాణ పోతురాజు పెద్దింటి అమ్మవారి ఆలయం, నర్సీపట్నంలో వేంకటేశ్వరస్వామి ఆలయం, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, నూకాలమ్మ అమ్మవారి ఆలయం, నక్కపల్లి మండలం ఒడ్డిమెట్టలో లక్ష్మీగణపతి ఆలయం, ఎలమంచిలిలో లోకల్ ఫండ్ చౌల్ట్రీ, అచ్యుతాపురం మండలం రావిపాలెంలో కోదండరామస్వామి ఆలయ కమిటీలకు ధర్మకర్త మండళ్ల ఏర్పాటు చేయడానికి ప్రకటన విడుదల చేశారు.

ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

అనకాపల్లిలో ఎన్టీఆర్ ఆస్పత్రి, రైల్వే స్టేషన్ వద్ద ఎనిమిది నెలల క్రితం పునఃప్రారంభం

- ఇంతవరకు 3.65 లక్షల మందికి భోజనం


భోజనం చేస్తున్న వారితో రద్దీగా వున్న అన్న క్యాంటీన్

అనకాపల్లి టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): **పట్టణంలో ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వేస్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లు నిత్యం వందలాది మంది పేదల కడుపు నింపుతున్నాయి. గత ఏడాది సెప్టెంబరు 19వ తేదీన పునఃప్రారంభించినప్పటి నుంచి ఇంతవరకు మూడు లక్షల 65 వేల మంది భోజనాలు/ అల్పాహారం చేశారు.**

తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుపేదల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయించారు. కేవలం ఐదు రూపాయలకే అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే వైసీపీ 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లను మూసివేసింది. పేరు మార్చి, మీకు నచ్చిన పేరు పెట్టుకుని క్యాంటీన్లను కొనసాగించాలని చంద్రబాబుతోపాటు పలువురు నాయకులు విజ్ఞప్తి చేశారు. కానీ వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. కాగా కూటమి అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని టీడీపీ జాతీయ అధ్య క్షుడు చంద్రబాబునాయుడు గత ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఎన్నికల తరువాత కూటమి అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లను తెరిపించారు. అనకాపల్లిలో ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వేస్టేషన్‌ల వద్ద వున్న అన్న క్యాంటీన్‌లను గత ఏడాది సెప్టెంబరు 19వ తేదీన పునఃప్రారంభించారు. ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, పూరి, పొంగలి పెడుతున్నారు. మధ్యాహ్నం, రాత్రి అన్నం, సాంబారు, పచ్చడి, కూర, పెరుగుతో భోజనం వడ్డిస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో ఇప్పటి వరకు లక్షా 90 వేల మంది, రైల్వేస్టేషన్ వద్ద ఉన్న క్యాంటీన్‌లో లక్షా 75 వేల మంది భోజనాలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. రైల్వే స్టేషన్ వద్ద క్యాంటీన్‌తోపోలిస్తే ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద ఉన్న క్యాంటీన్‌కు రద్దీ అధికంగా వుంటున్నది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులతోపాటు సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్, కొబ్బరికాయల మార్కెట్ కార్మికులు ఇక్కడ రూ.5కే భోజనం చేస్తున్నారు. రైల్వేస్టేషన్ వద్ద వున్న క్యాంటీన్‌లో ఎక్కువగా భవన నిర్మాణ కార్మికులు, రిక్షా కార్మికులు, దూర ప్రాంతాలకు ప్రయాణం సాగించే వారు, వలస కూలీలు భోజనం చేస్తుంటారు. బజార్‌లో రూ.5కి కనీసం టీ కూడా రాదని, అటువంటిది కడుపు నిండా భోజనం పెడుతున్నారని పలువురు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే భోజనం బయట హోటళ్లలో చేయాలంటే కనీసం రూ.100 తీసుకుంటారని చెబుతున్నారు.



అనకాపల్లిలో అన్నక్యాంటీన్

ఎలమంచిలిలో వైసీపీకి ఎదురుదెబ్బ

ఎలమంచిలి, మే 9 (ఆంధ్రజ్యోతి): **స్థానిక మునిసిపాలిటీలో వైసీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఇద్దరు మునిసిపల్ వైస్ చైర్మన్లపై అవిశ్వాసం ప్రకటిస్తూ 16 మంది కౌన్సిలర్లు, అధికారులకు నోటీసు అందజేశారు. వీరిలో చైర్‌పర్సన్ కాకుండా మిగిలిన వారిలో 13 మంది వైసీపీ కౌన్సిలర్లే కావడం గమనార్హం. గత ఏడాది సాధారణ ఎన్నికల తరువాత వైసీపీని వీడి బీజేపీలో చేరిన చైర్‌పర్సన్ రమాకుమారిని పదవి నుంచి దించేయడానికి ఆ పార్టీ సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన విషయం తెలిసిందే. తనపై అవిశ్వాస నోటీసు ఇవ్వడానికి ప్రధాన కారకులు వైస్‌చైర్మన్లే అని భావించిన చైర్‌పర్సన్.. ఆ ఇద్దరినీ పదవుల్లో లేకుండా చేయడానికి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నట్టు తెలిసింది. దీంతో ఎలమంచిలి మునిసిపాలిటీ రాజకీయాలు మారోసారి చర్చనీయాశంగా మారాయి.**

వైస్‌చైర్మన్లపై సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాసం

- 16 మంది సంతకాలతో మునిసిపల్ అధికారులకు నోటీసు
- వీరిలో 13 మంది వైసీపీ కౌన్సిలర్లు!
- అవిశ్వాసం నెగ్గుతుందని చైర్‌పర్సన్ వర్గీయుల ధీమా
- రాజీనామా యోచనలో వైస్‌చైర్మన్లు?

ఎలమంచిలి మునిసిపాలిటీకి 2021లో జరిగిన ఎన్నికల్లో 25 వార్డులకుగాను 23 వార్డుల్లో వైసీపీ గెలుపొందింది. టీడీపీ, ఇండిపెండెంట్ ఒక్కో వార్డులో గెలిచారు. వైసీపీకి చెందిన పిల్లా రమాకుమారి చైర్‌పర్సన్‌గా, బెజవాడ వెంకట గోవిందరాజు నాగేశ్వరరావు, అరెపు నాగ త్రినాథ ఈశ్వర గుప్తా వైస్ చైర్మన్లుగా ఎన్నికయ్యారు. కౌన్సిల్‌లో పూర్తిస్థాయి మెజారిటీ వుండడంతో గత ఏడాది సాధారణ ఎన్నికల వరకు ఏకపక్షంగా పాలన సాగింది. న్నికల తరువాత వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. అంతర్గత కారణాలేమిటో తెలియదుగానీ చైర్‌పర్సన్ రమాకుమారి వైసీపీని వీడి తన సోదరుడు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆనందకుమార్‌తో కలిసి బీజేపీలో చేరారు. కానీ వైసీపీ నుంచి ఒక్క కౌన్సిలర్ కూడా ఆమె బాటలో నడవలేదు. కౌన్సిల్‌లో పూర్తి బలం వుండడంతో పార్టీ ఫిరాయించిన రమాకుమారిని చైర్‌పర్సన్ పదవి నుంచి దించేయాలని అధిష్ఠానం హుకుం జారీచేసింది. దీంతో కౌన్సిలర్లతో స్థానిక సీనియర్ నేతలు సమావేశమై చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయిం చుకున్నారు. అనంతరం ఇద్దరు వైస్‌చైర్మన్లతో సహా మొత్తం 19 మంది కౌన్సిలర్ల సంతకాలతో కమిషనర్‌కు నోటీసు అందజేశారు. అనంతరం చైర్‌పర్సన్, ఆమె సోదరుడు తెరవెనుక పావులు కదిపారు. అవిశ్వాస తీర్మాన నోటీసుపై సంతకాలు చేసిన వారిలో పలువురు కౌన్సిలర్లను తమ వైపునకు తిప్పుకున్నారు. దీంతో అవిశ్వాస తీర్మానం వీగిపోవడం ఖాయమని తేలడంతో గత నెల 21వ తేదీన కమిషనర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి వైసీపీ సభ్యులు గైర్హాజరయ్యారు. దీంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయింది.


మునిసిపల్ మేనేజర్‌కు అవిశ్వాస తీర్మాన నోటీసును అందజేస్తున్న కౌన్సిలర్లు



ఎలమంచిలి మునిసిపల్ కార్యాలయం

వైస్‌చైర్మన్లపై ప్రతీకారం?

తనపై అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసు ఇవ్వ డానికి మాజీ ఎమ్మెల్యేతోపాటు ఇద్దరు వైస్ చైర్మన్లు ప్రధాన కారణంగా భావించిన చైర్‌పర్సన్ రమాకుమారి.. ఆ ఇద్దరిని పదవీచ్యుతులను చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ప్రస్తుతం వైసీపీకి 22 మంది కౌన్సిలర్లు (అధికారికంగా) వుండగా, వారిలో 13 మందిని చైర్‌పర్సన్ తన వైపునకు తిప్పుకున్నారు. ఇద్దరు వైస్‌చైర్మన్లపై అవిశ్వాసం ప్రకటిస్తూ మొత్తం 16 మంది సంతకాలతో గురువారం మునిసిపల్ మేనేజర్‌కు నోటీసు అందజేశారు. కమిషనర్ ప్రసాదరాజు ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి పాల ధర పెంపు

లీటర్‌కు రూ. 2 పెంచిన విశాఖ డెయిరీ

- వినియోగదారులపై రోజుకు రూ.10 లక్షల భారం
- పెరుగు ధరలు కూడా...


విశాఖ డెయిరీ పాల ప్యాకెట్లు

విశాఖపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి: పాల వినియోగదారులపై మరింత భారం మోపేందుకు విశాఖ డెయిరీ యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం నుంచి పాల ధరను లీటరుకు రెండు రూపాయలు, పెరుగు ధరను కిలోకు రెండు రూపాయలు పెంచుతున్నట్టు ప్రకటించింది. నూతన ధరల ప్రకారం హోమోజినైజ్డ్ డబుల్ టోన్డు పాలు 500 ఎంఎల్ (అర లీటరు) ప్రస్తుతం రూ.25 ఉండగా, రూ.26కు పెంచింది. లీటరు రూ.50 నుంచి రూ.52 చేసింది. హోమోజినైజ్డ్ టోన్డు పాలు అరలీటరు రూ.27 నుంచి రూ.28కు, లీటరు ప్యాకెట్ రూ.54 నుంచి రూ.56కు, టోన్డు పాలు అరలీటరు రూ.27 నుంచి రూ.28కు, స్టాండర్డైజ్డ్ పాలు అర లీటరు రూ.30 నుంచి రూ.31కు, ఫుల్ క్రీమ్ ... మిగతా 6వ పేజీలో

ఏయూఈఈటీ-2025 ఫలితాలు విడుదల

విశాఖపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో (సెల్ఫ్ సపోర్ట్) ప్రవేశాల కోసం నిర్వహించిన ఏయూఈఈటీ-2025 ఫలితాలను శుక్రవారం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ విడుదల చేశారు. ఈ పరీక్షకు 6,028 మంది దరఖాస్తు చేయగా, 5,634 మంది హాజరయ్యారు.

విశాఖకు చెందిన మామిడి రోహిత్ మొదటి ర్యాంకు సాధించగా, పాలకొండకు చెందిన కె.చరణ్‌రామ్‌సాయి రెండో ర్యాంకు, విశాఖకు చెందిన వీవీ కాశ్యప్ మూడో ర్యాంకు, బొబ్బిలికి చెందిన ఎం.కార్తికేయ నాలుగు, ఇచ్ఛాపురానికి చెందిన ఎస్.అక్షయ్ కుమార్ ఐదో ర్యాంకు సాధించారు. పరీక్షల ఫలితాలను ప్రవేశాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు అధికారులు వెల్లడించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ఇఎన్ ధనుంజయరావు, ప్రవేశాల సంచాలకులు డీఏ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. కౌన్సెలింగ్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను కొద్దిరోజుల్లో విడుదల చేస్తామని డీఏ నాయుడు తెలిపారు.

కి లేడీ

తీరు మార్చుకోని పోలీస్ అధికారిణి స్వర్ణలత

- మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి డబ్బులు గుంజేందుకు యత్నించి మరోమారు పోలీసులకు చిక్కిన వైనం
- కాల్ లిస్ట్‌లో కొందరు కీలక అధికారుల నంబర్లు
- తరచూ సంభాషణలు
- నగరంలో పనిచేస్తున్న సమయంలో నోట్ల మార్పిడి వ్యవహారంలో ఒకసారి అరెస్టు
- ఆ తరువాత వైసీపీ నాయకుడి ద్వారా మళ్లీ పోస్టింగ్
- ఇప్పుడు ఏసీబీ పేరుతో బెదిరింపులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అడ్డగోలు సంపాదనకు అలవాటుపడిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత ప్రభుత్వ శాఖల సిబ్బందినీ బెదిరించి డబ్బులు గుంజుతున్నారు. ఇందుకోసం ఆమె నమ్మకమైన మనుషులతో బృందాలనే ఏర్పాటుచేసుకున్నారు. అవసరాలకు ఉపయోగపడతారని రాజకీయ ప్రముఖులతోను అంట కాగుతున్నారు.


స్వర్ణలత (ఫైల్ ఫొటో)

ఆమె గతంలో నగరంలో పనిచేసినప్పుడు వైసీపీకి చెందిన ఓ ప్రముఖ నాయకుడితో గట్టి పరిచయమే ఉంది. తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, వారి వివరాలు కావాలని సదరు నాయకుడు కోరగా పోలీస్ పెద్దలతో ఉన్న పరిచయాలతో ఆమె ఆ జాబితా సంపాదించి గంటల వ్యవధిలోనే అందించారు. ఆమెకు సినిమాలపై మోజు, సదరు నాయకుడికి కొన్ని సినిమాలు నిర్మించిన అనుభవం కూడా ఉండడంతో వారి లావాదేవీలు మరింత ముందుకు వెళ్లాయి. ప్రభుత్వం నిషేధించిన రూ.2 వేల నోట్లను భారీ సంఖ్యలో మార్పిడి వ్యవహారంలో నేవీ సిబ్బందినే బెదిరించి ఆమె 2023లో పోలీసులకు దొరికిపోయారు. ఆ కేసుతో అరెస్టయి, జైలు పాలయ్యారు. ఆ తరువాత కూడా వెనక్కి తగ్గలేదు. వైసీపీకి చెందిన మరో నేత ద్వారా కేసు కొట్టి వేయించుకొని మళ్లీ పోస్టింగ్ వేయించుకున్నారు. బాపట్లలో ఉద్యోగం చేస్తూనే విశాఖలో పలు శాఖల అధికారులను బెదిరిస్తూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు.

రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, రిజిస్ట్రేషన్ల శాఖలపై దృష్టి

రెవెన్యూ శాఖలో తహశీల్దార్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు ... మిగతా 6వ పేజీలో

ఉన్నత చదువుల్లోనూ రాణించాలి

▸▸ ఎమ్మెల్యే విజయకుమార్



టెన్త్ విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, మే 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో చూపిన ప్రతిభ ఉన్నత చదువుల్లోనూ కొనసాగించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ విద్యార్థులకు సూచించారు. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో టాపర్‌గా నిలిచిన మునగపాక జడ్పీ స్కూల్ విద్యార్థులను శుక్రవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు పెంపు లక్ష్యంగా బోధనలు జరుగుతున్నాయని చెప్పారు. మండల టాపర్‌గా నిలిచిన ఆడారి లక్ష్మీగణేష్ (586), బుదిరెడ్డి రేణుక (579). టెక్కలి భాగ్యలక్ష్మి (578)ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం ఎం.శ్రీనివాసరావు, కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరామారావు, మండల టీడీపీ, జనసేన అధ్యక్షులు దొడ్డి శ్రీను, టెక్కలి పరశురాం, ఆడారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోండి



పాడి రైతులకు దాణా బేసిన్‌లు అందజేస్తున్న నాయకులు

మునగపాక, మే 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ అందిస్తున్న సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపురం మాజీ సర్పంచ్ సుందరపు వెంకట కనకఅప్పారావు అన్నారు. గ్రామంలో విశాఖ డెయిరీ నిధులతో నిర్మించిన పాలకేంద్రం అదనపు భవనాన్ని శుక్రవారం మాజీ సర్పంచ్ సుందరపు వెంకట కనకఅప్పారావు ప్రారంభించారు. పాడి రైతులకు పశుదాణా బేసిన్లు పంపిణీ చేశారు. 100 మంది పాడి రైతులకు బేసిన్లు అందజేశారు. పాల సొసైటీ అ ధ్యక్షుడు సుందరపు కాసులుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి (తాతాజీ), జనసేన పార్టీ వీర మహిళ సుందరపు ధనలక్ష్మి, గ్రామ పెద్దలు, డెయిరీ జోనల్ మేనేజర్ శరగడం రమణ, సివిల్ ఇంజనీర్ వెలగా సురేశ్‌కుమార్, పి.గురుమూర్తి, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజన్-2047 లక్ష్యంగా పనిచేయండి

నక్కపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలులో ప్రతీ ఒక్కరు అంకితభావంతో పనిచేయాలని నియోజకవర్గం ప్రత్యేకాధికారి శచీదేవి సూచించారు. శుక్రవారం సాయంత్రం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పలు ప్రభుత్వశాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు విజన్ -2047 ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతీ ఒక్కరు పని చేయాలని సూచించారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న గ్రామాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సీతారామరాజుకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలుశాఖల అధికారలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో రక్షిత నీటి పథకం ట్యాంక్

▸▸ అప్పన్నపాలెం కాలనీ వాసుల భయాందోళన

రాంబిల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరపూడి పంచాయతీ అప్పన్నపాలెం కాలనీలోని రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ట్యాంక్ ద్వారా అప్పన్నపాలెం, అప్పన్నపాలెం కాలనీలకు తాగునీరు సరఫరా అవుతోంది. సుమారు 40 వేల లీటర్ల సామర్థ్యం గల ఈ ట్యాంక్ ప్రస్తుతంప్రమాదకరంగా మారింది. కిందన పిల్లర్లు దెబ్బతిన్నాయి. ట్యాంక్ పైకి వెళ్లే మెట్లు పెచ్చులు రాలిపోతున్నాయి. దీంతో ట్యాంక్‌ను శుభ్రం చేసే పరిస్థితి లేకుండా పోయింది. ట్యాంక్ స్లాబ్ నుంచి కూడా పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఇది ఏ సమయంలో కూలిపోయి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఇటీవల హరిపురంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు వినతి పత్రమందించినట్టు చెప్పారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఈ రక్షిత ట్యాంక్‌కు మరమ్మతులు జరిపి సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కూలే స్థితిలో ఉన్న ట్యాంక్



పిల్లరు బీటలు వారి బయటకు కనిపిస్తున్న ఊచలు

సురక్షిత నీరేదీ?

▸▸ క్లోరినేషన్‌కు దూరంగా సంతపాలెంలో రక్షిత పథకం ట్యాంక్

రాంబిల్లి: మండలంలోని సంతపాలెం కాలనీ వాసులకు మినీ రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌ను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. చాలా ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన ఈ మంచినీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. ఈ ట్యాంక్ ద్వారా 24 గంటలు కాలనీ ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే, ట్యాంక్ మరమ్మతుకు లోనవడంతోపాటు,దీనికి ఉన్న ట్యాప్‌లు కూడా దెబ్బతిన్నాయి. ట్యాంక్ చుట్టూ చెత్తపేరుకుపో వడంతో దుర్వాసర వస్తోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నీటి నీరు వాడకంతో రోగాలు ప్రబలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారులకు, పాలకులకు విన్నవించినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఇప్పటికే తాగునీటి సమస్య అధికంగా ఉందని, అధికారులు స్పందించి ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టి, లోన శుభ్రం చేయించి తాగునీరు సరఫరా చేసేలా చూడాలని సంతపాలెం వాసులు కోరుతున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న ట్యాంక్

పండు మిరప ధర పతనం

▸▸ డీలా పడిన రైతులు



అచ్యుతాపురం సంతకు వచ్చిన పండు మిరప కాయలు

అచ్యుతాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): పండు మిర్చి ధర దారుణంగా పడిపోవటంతో రైతులు డీలా పడ్డారు. శుక్రవారం మండల పరిధిలోని అచ్యుతాపురం, మోసయ్యపేటల్లో జరిగిన వారపు సంతలకు పరిసర ప్రాంతాల నుంచి భారీగా పండు మిర్చిని రైతులు తీసుకువచ్చారు. అయితే సంతల్లో వీటిని కొనే నాథుడే కానరాలేదు. పొట్టి కాయలు కేజీ రూ.60, సన్నకాయలు కేజీ రూ. 50కి వ్యాపారులు కొనుగోలు చేస్తామనటంతో రైతులు ఆందోళన చెందారు. గతవారం పొట్టికాయలు రూ. 120, సన్నాలు రూ.100కు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో మిర్చి ధర పడిపోవటం వల్ల తాము అంతకన్నా ఎక్కువ ధరకు కొనుగోలు చేయలేమని వ్యాపారులు చెప్పటంతో కొందరు రైతులు విక్రయించగా, మరి కొందరు తిరిగి తీసుకువెళ్లిపోయారు. ఈ ధర ప్రకారం విక్రయిస్తే కనీసం కూలి డబ్బులు కూడా రావని ఆవేదన చెందారు.

ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలన: డీపీవో



వెదురువాడ చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

అచ్యుతాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలన జరుపుతున్న డీపీఓ శిరీషారాణి తెలిపారు. శుక్రవారం ఆమె ఎర్రవరంలో భూసమస్యపై వచ్చిన పిర్యాదుపై పరిశీలనకు వచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుని క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి పరిష్కారానికి కృషిచేస్తున్నామన్నారు. అనంతరం వెదురువాడలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా కృషిచేయాలన్నారు. ఈఓపీఆర్డీ శ్రీరామానాయుడు ఆమె వెంట ఉన్నారు.

ఉద్యోగాల కల్పనే ధ్యేయం: ఎమ్మెల్యే



సెజ్‌లో ఎఫ్‌ఎఫ్‌సీ ప్రారంభిస్తున్న ఎమెల్యే సుందరపు

రాంబిల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఎస్‌ఇజడ్‌లోని ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపడుతుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు రాజాన రమేశ్‌కుమార్, వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, బి.రామదాస్, జె. శ్రీనివాసరావు, దొడ్డిశ్రీను, అన్నం బాబ్జి, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత శంకర రావు

అచ్యుతాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈనెల 20న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకర రావు పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈస్థితిలో లేబర్ కోడ్‌లు రద్దు, కనీస వేతనాలు, రైతులకు గిట్టుబాటు ధర డిమాండ్‌లతో సమ్మె చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రొంగలి రాము, కెసోమునాయుడు, కె.నాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాల ధర పెంపు

... 5వ పేజీ తరువాయి

పాలు లీటరు రూ.63 నుంచి రూ.66కు, హోమోజినైజ్డ్ టోన్డు పాలు (గంగ) అరలీటరు రూ.28 నుంచి రూ.29కు, డబుల్ టోన్డు పాలు (గంగ) రూ.26 నుంచి రూ.27కు పెంచింది.

కాగా టోన్డు పెరుగు 180 గ్రాముల ప్యాకెట్ రూ.14 నుంచి రూ.15కు, 900 గ్రాముల ప్యాకెట్ రూ.54 నుంచి రూ.56కు, కేజీ ప్యాకెట్ రూ.64 నుంచి రూ.66కు పెంచారు. పెరిగిన ధరలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి.

రూ.10 లక్షలకు పైగా భారం

విశాఖ డెయిరీ ప్రతి రోజూ సుమారు 5 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తుండడంతో డెయిరీ పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వినియోగదారులపై రోజుకు సుమారు రూ.10 లక్షల మేర అధిక భారం పడుతుందని అంచనా వేస్తున్నారు.

ఎలమంచిలిలో వైసీపీకి ఎదురుదెబ్బ

... 5వ పేజీ తరువాయి

ఈ విషయాన్ని శుక్రవారం మీడియాకు వెల్లడించారు.

నోటీసుపై సంతకాలు చేసిన సభ్యులు

చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, టీడీపీకి చెందిన మజ్జి రామకృష్ణ (23వ వార్డు), ఇండిపెండెంట్ సీరా సాయి ప్రసన్న (8వ వార్డు), వైసీపీకి చెందిన పండూరి హరనాథ్ (2వ వార్డు), తుంపాల శ్రీనివాసరావు (3వ వార్డు), ఆడారి పార్వతి (6వ వార్డు), కట్టమూరి సుజాత (7వ వార్డు), మంజేటి అప్పల కొండమ్మ (10వ వార్డు), చాగంటి రాజు (14వ వార్డు), మైచర్ల కిరణ్ (16వ వార్డు), రాయి భార్గవి(18వ వార్డు), సుంకరి మరిణేశ్వరరావు (24వ వార్డు) ఆర్‌డీఎస్‌జీటీ కొండల రావు (25వ వార్డు), ఈరిగెల గణేశ్ (15వ వార్డు), పడాల కావ్య (17 వార్డు), పిట్టా సత్తిబాబు (19వ వార్డు).

రాజీనామా ఆలోచనలో వైస్ చైర్మన్లు?

మునిసిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యేతో కలుపుకుని మొత్తం 26 మంది వున్నారు. వైస్‌చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 2/3 వంతు మంది.. అంటే 17 మంది సభ్యులు అవసరం. అవిశ్వాస నోటీసుపై 16 మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారు. ఎమ్మెల్యేతో కలుపుకుంటే 17 మంది అవుతారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గడం, వైస్‌చైర్మన్లను పదవి నుంచి దించడం ఖాయమని చైర్‌పర్సన్ వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో ముందుగానే రాజీనామా చేయాలని వైస్‌చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు నాగ త్రినాథ గుప్తా యోచిస్తున్నట్టు తెలిసింది. అయితే పార్టీ పెద్దలతో మాట్లాడిన తరువాత తుది నిర్ణయం తీసుకుంటామని వైస్‌చైర్మన్ నాగత్రినాథ ఈశ్వరగుప్తా చెబుతున్నారు.

కిలేడీ

... 5వ పేజీ తరువాయి

రిజిస్ట్రేషన్ల శాఖలో సబ్ రిజిస్ట్రార్లకు అడ్డగోలు ఆదాయం వస్తుందని గ్రహించి, కీలకమైన స్థానాల్లో ఉన్నవారిని 'ఏసీబీ' పేరుతో బెదిరించి స్వర్ణలత భారీ వసూళ్లకు పాల్పడుతున్నారు. తాజాగా మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఏసీబీ సీఐగా వెళ్లి దొరికిపోయిన బలగా సుధాకర్ ఆమె బృందంలో మనిషేనని బయటపడింది. నకిలీ సీఐ సుధాకర్...'ఉన్నతాధికారితో మాట్లాడండి' అంటూ స్వర్ణలతకు ఫోన్ చేయడంతో ఆమె గుట్టు రట్టయింది. తొలుత ఆమెను తప్పించాలని కొందరు పెద్దలు యత్నించారు. కానీ అప్పటికే సమాచారం లీక్ కావడం, పత్రికల్లో ఆమె వివరాలు రావడంతో అరెస్టు చేయక తప్పలేదు. ఆమె ఫోన్ కాల్ లిస్టులో పలు శాఖలకు చెందిన కొందరు అధికారుల నంబర్లు ఉన్నట్టు గుర్తించారు. వారితో రెగ్యులర్‌గా సంభాషిస్తున్నట్టు తెలిసింది. అందులో కొందరు అధికారులు ఆమెను ప్రత్యేకంగా కలవడానికి ప్రతి నెలా పని గట్టుకొని విజయవాడ వెళుతున్నట్టు ఆయా శాఖల సిబ్బంది గుసగుసలాడుతున్నారు. సాధారణంగా తహశీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు ప్రతి నెలా విజయవాడ వెళ్లి ఉన్నతాధికారులను కలవాల్సిన అవసరం ఉండదు. కానీ వారు వెళుతున్నారంటే ఏదో ఉందని అనుమానిస్తున్నారు.

జీవీఎంసీ జోన్-2లో ఏమి జరిగిందో...?

మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లడానికి ముందు నకలీ ఏసీబీ సీఐ బలగ సుధాకర్ జీవీఎంసీ జోనల్-2 కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ వారు అనుకున్న విధంగా పని పూర్తయినట్టు తెలిసింది. అక్కడ ఎంత పుచ్చుకున్నారు?, ఎవరు ఇచ్చారు?...అనేది బయటకు రానివ్వడం లేదు. ఏసీబీ అధికారులు స్వర్ణలత కేసును మరింత పకడ్బందీగా విచారణ చేసి, అసలు ఇప్పటివరకూ ఎంతమందిని బెదిరించారు?, ఏ మేరకు వసూలు చేశారనే వివరాలు వెలికితీయాలి. అదేవిధంగా భవిష్యత్తులో ఇలాంటి వ్యవహారాలకు పాల్పడకుండా చూడాలి.


రాజయ్యపేట టీడీపీ అధ్యక్షుడిగా గంగరాజు



కొత్తగా ఏర్పాటైన రాజయ్యపేట టీడీపీ కమిటీ ప్రతినిధులు

నక్కపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేటలో శుక్రవారం జరిగిన టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికల్లో పిక్కి గంగరాజును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హోం మంత్రి అనిత గ్రామ కమిటీల నియామకానికి జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికలు జరిగాయని పలువురు నేతలు చెప్పారు. ఈ మేరకు టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నామని చెప్పారు. ఈ ఎన్నికల్లో గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడిగా పిక్కి నూకరాజు, గ్రామ ప్రధాన కార్యదర్శిగా సిరిపల్లి అప్పలరాజు, సోమేశ్, దైలపల్లి శ్రీను, పిక్కి లక్ష్మణ్, చేపల రామకృష్ణ తదితరులు ఎన్నికయ్యారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ



గోకులపాడులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం పంచాయతీ పరిధి గోకులపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగు పై అవగాహన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ర్యాలీ చేసింది. ఈ కార్యక్రమం జి బుజ్జి, సర్పంచ్ కర్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. అనంతరం గ్రామంలో అత్యధికంగా పంటలు సాగు చేసే పలువురు రైతులను సర్పంచ్ సత్యనారాయణ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భూ సమస్యలపై మండల కమిటీ సమావేశం

ఎస్.రాయవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో భూసమస్యల పరిష్కారం కోసం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి మనోరమ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులతో మనోరమ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె రమేశ్‌బాబు ఏఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛభారత్

నక్కపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి దగ్గర శుక్రవారం హెటిరో ఔషధ పరిశ్రమ యాజమాన్యం ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి పరిసరాల్లో ఉన్న వ్యర్థాలను తొలగించారు. హెటిరో ప్రతినిధులు ఎస్.కుల్లాయిరెడ్డి, సుబ్బారెడ్డి, రాజారెడ్డి, సత్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో పనులు చేశారు. ప్రతీ నెలా ఆసుపత్రిలో పనులు చేస్తామని వారు చెప్పారు.

అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేయండి

▸▸ నియోజకవర్గ ప్రత్యేకాధికారి శచీదేవి





మండల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి... హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

పాయకరావుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): విజన్-2047 లక్ష్యంగా వచ్చే ఐదేళ్లలో ప్రతి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శచీదేవి ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలో పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఐదు సంవత్సరాల్లో ప్రజల సమస్యల పరిష్కారాని కృషి చేయాలని ఆమె అన్నారు. ప్రతి గ్రామంలో విద్యా, వైద్యం, విద్యుత్, వ్యవసాయం, శాఖలు అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తామని ఆమె అన్నారు. అనంతరం గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఆర్.జయప్రకాశ్, ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు, ఏఓ వర్మ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో వసతులు కరువు

పాయకరావుపేట రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురం శ్మశానవాటికలో కనీస వసతులు లేక దహన సంస్కారాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ గ్రామంలో సుమారు 2500 జనాభా నివసిస్తున్నారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు చేయడనికి ఇబ్బందులు పడుతున్నామని, గ్రామానికి చెందిన నీలాపు వెంకటరెడ్డి, అప్పలరెడ్డి, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానంలో ఎటువంటి షెల్టరు గానీ, స్నానాలు చేయడానికి బోరు గానీ లేవని చెప్పారు. దహనసంస్కారాలు నిర్వహించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అప్పట్లో ఒక స్వచ్ఛంద సేవా సంస్థ దహనసంస్కారాలు నిర్వహించడానికి నిర్మించిన షెడ్డు నిర్మించారు. ఇప్పుడు ఆషెడ్డుపై రేకులు ఊడిపోయి శిథిలావస్థలో ఉంది. శ్మశానానికి చుట్టూ ప్రహరి నిర్మించి శ్మశానంలో షెల్టరు, బోరు తదితర వసతుల కల్పించాలని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



కుమరాపురం శ్మశానవాటికలో రేకులు ఊడిపోయిన షెడ్డు

సాగునీటి చెరువులో రోడ్డు తొలగింపు

▸▸ నోటీసులు ఇచ్చినా స్పందించని క్వారీ యజమాని

▸▸ దగ్గర ఉండి తొలగించిన రెవెన్యూ అధికారులు



చెరువులో ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు తొలగిస్తున్న అధికారులు

రోలుగుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజన్నపేటలో నిబంధనలకు విరుద్ధంగా సాగునీటి చెరువు మధ్యలో నుంచి క్వారీకి వేసిన రోడ్డును ఎట్టకేలకు శుక్రవారం తహసీల్దార్ నాగమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు తొలగించారు. రోడ్డు తొలగించి చెరువు గర్భాన్ని పూర్వస్థితికి తీసుకురావాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గత నెల 17న క్వారీ యజమానికి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. నాటి నుంచి క్వారీ యాజమాన్యం స్పందించకపోవడంతో శుక్రవారం తహసీల్దార్ నాగమ్మ, ఆర్ఐ రామమూర్తి, సర్వేయర్ తవిటినాయుడు, వీఆర్వో శ్రీనివాసరావు తదితరులు ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు తొలగించారు. సాగునీటి చెరువు గర్భాన్ని పూర్వస్థితికి తీసుకువచ్చి, రైతులకు సాగు నీరు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

విద్య, క్రీడలకు ప్రాధాన్యం

పాయకరావుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తేనే విద్యార్థి మానసిక వికాశం పొందుతాడని శ్రీప్రకాశ్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్ ప్రకాశ్ అన్నారు. స్థానిక శ్రీప్రకాశ్ విద్యా సంస్థల్లో 15 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు, క్రీడలపై కూడా ఆసక్తి చూపిస్తే దేహధారుడ్యం, మేథాశక్తి పెరుగుతుందని అన్నారు. తమ విద్యా సంస్థల్లో 25 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులపట్ల విద్యార్థులు ఆసక్తి చూపించడం ఆనందంగా ఉందన్నారు. సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్స్ ఇచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తితో పాటు పలువురు కోచ్‌లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీనివాసుని కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా శ్రీనివాసుని కల్యాణ వేడుకలు

చోడవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆపదహర వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీనివాసుని కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను భక్తులు కన్నులపండువలా తిలకించారు. అర్చకులు శ్రీమాన్ అరసవెల్లి శేషరామాచార్యులు, శాంతారామాచార్యులు, శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉత్సవాలను జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వింజమూరి శంకర్, దేవదాయ శాఖ ఈవో సత్యనారాయణ, సభ్యులు నాకందర్ప రమణమూర్తి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పనసారెడ్డి, నూకరాజు, భక్త మహిళా మండలి సభ్యులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

నవధాన్య విత్తనాలతో భూమి సారవంతం



నవధాన్య విత్తనాల కిట్లను చూపిస్తున్న రైతులు

నాతవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): నవధాన్య విత్తనాలు వల్ల భూమి సారవంతమవుతుందని జిల్లా బ్లూమ్ ఇన్‌చార్జి గోవింద్ తెలిపారు. మండలంలోని శరభూపాలపట్నం గ్రామాన్ని వంద శాతం ప్రకృతి వ్యవసాయ గ్రామంగా ఎంపిక చేశారు. నవధాన్యాలతో 160 కిట్లను సర్పంచ్ ఎల్.సత్యనారాయణ ఆధ్వర్యంలో తయారు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోవింద్ మాట్లాడుతూ నవ్యధాన్య విత్తనాల వల్ల భూమిలో సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయన్నారు. నీటి నిల్వ సామర్థ్యం పెరిగి తెగుళ్లు సోకవని చెప్పారు. భూమిలో సేంద్రియ కర్బన్ శాతం స్థిరంగా ఉంటుందన్నారు. అలాగే పచ్చిరొట్ట వేయడం వల్ల ప్రధాన పంట దిగుబడి బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాధికారులు, సిబ్బంది నారాయణమూర్తి దుర్గా, మాతాజీ, ధనలక్ష్మీ, వెంకటలక్ష్మి, సంధ్య, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను ఇరు వర్గాల వారు అధికారుల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ వి.వేణుగోపాల్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సమావేశంలో భూ సమస్యలకు సంబంధించి తహసీల్దార్ వేణుగోపాల్ ఇరు వర్గాల వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలను అనుసరించి ఇరు వర్గాల వారికి న్యాయం చేస్తామని తహసీల్దార్ చెప్పారు. కోర్టులకు వెళ్తే విలువైన సమయం, డబ్బు వృథా అవుతాయన్నారు. భూ వివాదాలతో కుటుంబాల్లో కలహాలు ఎక్కువవుతాయన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి పి.పార్థసారథి పాల్గొన్నారు.

గొలుగొండలో వృథాగా తాగునీరు



ఎస్‌బీఐ బ్రాంచి వద్ద రహదారిపై ఏరులై పారుతున్న తాగునీరు

గొలుగొండ, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్రాంచి వద్ద వారం రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. లింగంపేట తాగునీటి పథకం పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో నీరు వృథా అవుతోంది. దీంతో గ్రామంలో అరకొరగానే తాగునీరు అందుతుందని స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పైపులైన్ మరమ్మతులు చేపట్టి తాగునీరు వృథా కాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

'తప్పుడు ప్రచారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు'

కె.కోటపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు చేపడతామని తెలుగుదేశం పార్టీ నాయకుడు, కింతాడ మాజీ సర్పంచ్ బీవీ నరసింహానాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తాతముత్తాతల నుంచి సంక్రమించిన భూములు తప్ప ఎవ్వరిదీ కబ్జా చేయలేదన్నారు. నాలుగు సర్వే నంబర్లలో సుమారు 20 సెంట్లు పోరపోటున నమోదైందని, వాటిని తొలగించాలని అధికారులను కోరానని చెప్పారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు అందాలి

» రాజకీయాలకతీతంగా సంక్షేమ, అభివృద్ధి పనులు

» స్థానిక అవసరాల కోసం ఇసుక తవ్వకాలను అడ్డుకోవద్దు

» మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రాజు



మండల సమావేశంలో ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న ఎంపీటీసీ సభ్యులు

చోడవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ కార్డులు అందాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా ఇసుక, మట్టి తవ్వకాలకు అడ్డు చెప్పొద్దని అధికారులను ఆదేశించారు. ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇస్తున్నందున క్షేత్ర స్థాయిలో అధికారులు అడ్డుకోవద్దని తహసీల్దార్‌కు సూచించారు. అలాగే స్థానిక అవసరాలకు గ్రావెల్, మట్టి వాడుతున్నందున, వాటి తవ్వకాలను కూడా అడ్డుకోవద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్‌కార్డులు అర్హులందరికీ దక్కేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమం అభివృద్ధి పనులు చేపట్టాలని, తద్వారా పల్లెలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గౌరవ వేతనాలు అందించాలి

గౌరవ వేతనాలు రావడం లేదని, బకాయిలు పేరుకుపోయాయని ఎంపీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తమకు గౌరవ వేతనాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే రాజును వారు కోరారు. గత ప్రభుత్వ హయాంలో బకాయిల గురించి తాను హామీ ఇవ్వలేనని, తమ ప్రభుత్వం వచ్చిన తరువాత బకాయిలకు సంబంధించి జనరల్ ఫండ్ నుంచి చెల్లించాలని ఎంపీడీవో ఆంజనేయులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్యే రాజుకు కృతజ్ఞతలు తెలిపి ఆయనను సత్కరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, ఈవోపీఆర్‌డీ మహేశ్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి చెరువులో రోడ్డు తొలగింపు

» నోటీసులు ఇచ్చినా స్పందించని క్వారీ యజమాని

» దగ్గర ఉండి తొలగించిన రెవెన్యూ అధికారులు



సాగునీటి చెరువులో ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు తొలగిస్తున్న అధికారులు

రోలుగుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజన్నపేటలో నిబంధనలకు విరుద్ధంగా సాగునీటి చెరువు మధ్యలో నుంచి క్వారీకి వేసిన రోడ్డును ఎట్టకేలకు శుక్రవారం తహసీల్దార్ నాగమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు తొలగించారు. రోడ్డు తొలగించి చెరువు గర్భాన్ని పూర్వస్థితికి తీసుకురావాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గత నెల 17న క్వారీ యజమానికి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. నాటి నుంచి క్వారీ యాజమాన్యం స్పందించకపోవడంతో శుక్రవారం తహసీల్దార్ నాగమ్మ, ఆర్‌ఐ రామమూర్తి, సర్వేయర్ తవిటినాయుడు, వీఆర్వో శ్రీనివాసరావు తదితరులు ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు తొలగించారు. సాగునీటి చెరువు గర్భాన్ని పూర్వస్థితికి తీసుకువచ్చి, రైతులకు సాగునీరు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

చీడికాడ, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో వివిధ రంగాలకు చెందిన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శి రొంగలి దేముడునాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం వివిధ రంగాలకు చెందిన కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు నష్టదాయకమైన లేబర్‌కోడ్ తేవడం వల్ల సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, పని గంటలు పెంచడం, పారిశ్రామిక విధానాలు చట్టాలకు తూట్లు పొడవటం వంటి దుర్మార్గమైన విధానాలు లేబర్‌కోడ్‌లో పొందుపరిచారని ఆయన వాపోయారు. దీన్ని ఆమోదించకుండా తిప్పికొట్టాలని సమ్మె చేపడుతున్నామని, అన్ని రంగాలకు చెందిన కార్మికులంతా ముందుకురావాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన సంఘాల నాయకులు ఎం.జానకి, కమలకుమారి, చిన్నమ్మలు, నిర్మలతో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

రావికమతం, మే 9 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత పొందిన కన్నంపేట గ్రామానికి చెందిన సియాద్రి మణికంఠకు ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన మణికంఠ వైద్య సేవల కోసం భరించే స్థోమత లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థి మణికంఠకు తక్షణ వైద్య సహాయం కోసం కొత్తకోట జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.నాగేశ్వరావు, ఉపాధ్యాయులు వాసవీ లత, సిబ్బంది స్పందించారు. ఈ మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.23 వేల మొత్తాన్ని ఆ విద్యార్థి కుటుంబ సభ్యులకు అందజేశారు.

దివ్యాంగులకు మెగా డీఎస్సీ క్రాష్ కోర్సు శిక్షణ

అనకాపల్లి కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డీఎస్సీకి అర్హులైన దివ్యాంగ అభ్యర్థుల కోసం ఉచిత మెగా డీఎస్సీ క్రాష్ కోర్సు శిక్షణను విజయవాడలో నిర్వహించనున్నట్టు విభిన్నప్రతిభావంతుల శాఖ జిల్లా సహాయ సంచాలకులు బి.ఆసయ్య శుక్రవారం తెలిపారు. ప్రధానంగా దృష్టి లోపం, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ దివ్యాంగులై ఎస్‌జీటీ టీచర్ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల కోసం విజయవాడలో ఉచితంగా శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 40 శాతం దివ్యాంగత్వం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.

ఈ నెల 11వ తేదీలోగా ఎండీఎస్‌టీ.ఏపీఈఎఫ్ఎస్ఎస్. ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సూచించారు. టెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక బోధనా పద్ధతిలో శిక్షణ, స్టడీ మెటీరియల్ పంపిణీ, ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. అర్హులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి



ఫిర్యాదుదారులను విచారిస్తున్న అధికారులు

చీడికాడ, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో హేమసుందర్రావు, తహసీల్దార్ కిశోర్‌లింకన్ చెప్పారు. మండలంలోని రెండు గ్రామాలకు చెందిన భూ వివాదాలపై ఫిర్యాదులు అందడంతో శుక్రవారం విచారణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమస్యలపై ఇరు వర్గాల వారిని విచారణ చేస్తున్నామని చెప్పారు. వారిరువురి దగ్గర ఉన్న పూర్తి ఆధారాలు తీసుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సతీశ్, ఆర్‌ఐ కె.రామారావు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

నాగయ్యపేటలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం



చెత్తాచెదారం తొలగిస్తున్న సిబ్బంది, కార్మికులు

దేవరాపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేట గ్రామ పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. మండల ప్రత్యేక అధికారి మంజులవాణి, ఎంపీడీవో సువర్ణరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం చుట్టూ చెత్తా చెదారం తొలగించి పరిశుభ్రం చేశారు. అలాగే పశు వైద్యశాల, పాఠశాల పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో పశు వైద్యురాలు భాగ్య, ఈవోపీఆర్డీ ఉమాదేవి, కార్యదర్శి జీవన్‌బాబు, త్రినాథ్ పాల్గొన్నారు.

తైపురంలో ప్రభుత్వ స్థలాల పరిశీలన



కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు, సచివాలయ ఉద్యోగులు

బుచ్చెయ్యపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తైపురం గ్రామంలో ప్రభుత్వ స్థలాలను ఉద్యోగులు పరిశీలించారు. ఈ గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం స్థలం ఆక్రమణకు గురైనట్టు అందిన ఫిర్యాదు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. సబ్ సెంటర్ పరిసరాల్లో వాటర్ ట్యాంకు దిమ్మ తొలగించి మోటారు, బోరు, స్థలం ఆక్రమణ చేసినట్టు గుర్తించారు. డిఫారం భూమి పట్టా పేరుతో గ్రామానికి చెందిన పలువురు స్థలం ఆక్రమించారన్న టీడీపీ నేత పల్లా చిన్న ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

» బాలికా సాధికారతకు 'సింహాద్రి' ఎన్టీపీసీ కృషి అభినందనీయం » హోం మంత్రి వంగలపూడి అనిత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి అనిత, చిత్రంలో ఎమ్మెల్యే పంచకర్ల, సింహాద్రి ఈడీ సమీర్ శర్మ

పరవాడ, మే 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక బాధ్యతలో భాగంగా ఇక్కడి దీపాంజలినగర్‌లోని శకుంతల ఆడిటోరియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జెమ్ 2025 (బాలికా సాధికారత) కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా శక్తి దేశం అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థి దశలోనే బాలికలకు బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు పిల్లలను దూరంగా ఉంచడంతో పాటు చట్టాలపై వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాలికా సాధికారతకు సింహాద్రి ఎన్టీపీసీ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం చేస్తున్న కృషి అమోఘమన్నారు. అనంతరం హోం మంత్రి చేతుల మీదుగా స్వప్నాల విమానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. సింహాద్రి ఈడీ సమీర్‌శర్మ, దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు నీతాశర్మ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, సింహాద్రిలోని వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, దీపికా లేడీస్ క్లబ్ ప్రతినిధులు, సీఎస్ఆర్ అధికారులు పాల్గొన్నారు.

మురళీనాయక్ మృతి విషాదకరం

నర్సీపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో పాకిస్తాన్ సైనికుల బాంబు దాడిలో శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళీ నాయక్ మృతి చెందడం పట్ల స్పీకర్ అయ్యన్న పాత్రుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మురళీనాయక్ ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు. ఆయన ప్రాణ త్యాగం దేశ ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారన్నారు. మురళీ నాయక్ కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పంట మార్పిడిపై అవగాహన

మాకవరపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరం గ్రామంలో పంట మార్పిడిపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త బి.సహదేవరెడ్డి మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రధానంగా వరి తరువాత ఆరుతడి పంటలైన మొక్కజొన్న, కూరగాయలు, పండ్ల తోటలు వేసుకోవాలని చెప్పారు. అలాగే సమగ్ర వ్యవసాయ విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త తేజేశ్వరి, మండల వ్యవసాయ అధికారి చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.

ఏఎల్.పురం వీఆర్పీ తొలగింపు

గొలుగొండ, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎల్.పురం వీఆర్పీని తొలగించినట్టు ఉపాధి పథకం ఏపీవో సూర్యమణి శుక్రవారం తెలిపారు. 2024-2025లో చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగినట్టు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయని, విచారణలో నిధులు దుర్వినియోగమైనట్టు తేలిందని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులకు అందిన నివేదిక ఆధారంగా వీఆర్పీ వి.జ్యోతిని తొలగించినట్టు ఆమె తెలిపారు. గ్రామంలో ఉపాధి పనులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

రావికమతం, మే 9 (ఆంధ్రజ్యోతి): మలేరియా మాసోత్సవాల్లో భాగంగా చీమలపాడు పంచాయతీ శివారు కుంజుర్తి, పిడింపాలెం గిరిజన గ్రామాలలో శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి మోహిని సురేఖ 45 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వర్షాలు కురుస్తున్నందున ఆవాసాల మురుగు నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, కాచి ఒడబోసిన నీటినే తాగాలని గిరిజనులకు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పి.రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

చీడికాడ, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరహాపురం గ్రామంలో శుక్రవారం పిచ్చి కుక్క దాడి చేయడంతో ఇద్దరు ఉపాధి కూలీలు గాయపడ్డారు. వీరిని వీఆర్పీ సుబ్బలక్ష్మి, సహచర వేతనదారులు చోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఉపాధి పనులు చేస్తుండగా కూలీ రామిశెట్టి దేముడమ్మను కుక్క తీవ్రంగా కరవడంతో పాటు గ్రామంలో మొల్లివలస చినదేముడును గాయపరిచింది. వీరిలో ఉపాధి దేముడమ్మ పరిస్థితి విషమంగా ఉంది.

వడదెబ్బతో మాజీ సర్పంచ్ మృతి

బుచ్చెయ్యపేట, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్టిదొరపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ బొబ్బిలి చినఅప్పారావు శుక్రవారం వడదెబ్బకు గురై మృతి చెందారు. పొలంలో పనిచేస్తుండగా ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి గుండెల్లో నొప్పి వచ్చిందని కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా, అక్కడి కన్ను మూసినట్టు చెప్పారు.

కొత్త రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చెయ్యపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.లక్ష్మి శుక్రవారం సూచించారు. గ్రామ సచివాలయాల్లో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు సమర్పించవచ్చునని చెప్పారు. కార్డుల విభజన, చిరునామాల మార్పు, కొత్త కుటుంబ సభ్యులను చేర్చడం, అవసరం లేనివారి బియ్యం కార్డులు సరెండర్ చేసుకోవడం తదితర వాటి కోసం ఈ నెల 15వ తేదీ నుంచి వాట్సప్ ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉంటుందని ఆమె చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



గణేశ్ (ఫైల్)

మాకవరపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూటిపాలలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపిన వివరాలివి.. మాకవరపాలేనికి చెందిన లంక గణేశ్ (26) అనే యువకుడు ఐదేళ్ల కిందట తూటిపాల గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. కొంతకాలం వీరి దాంపత్య జీవనం సాఫీగా సాగినప్పటికీ మూడేళ్లుగా వీరిద్దరి మధ్య చిన్నచిన్న తగాదాలు జరుగుతూనే ఉండేవి. ఆరు నెలల కిందట భార్య తన కుమారుడ్ని తీసుకుని తూటిపాలలో ఉన్న కన్నవారింటికి వెళ్లిపోయింది. దీంతో గణేశ్ తీవ్ర మనస్థాపం చెంది ఉండేవాడు. గురువారం రాత్రి తన తల్లి నూకరత్నంకు తూటిపాల వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. అత్తవారింట ఏం జరిగిందో గానీ శుక్రవారం ఉదయం ఆ గ్రామానికి కొంత దూరంలో అత్తవారికి చెందిన జీడి తోటలో జీడి చెట్టుకు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. ఈ విషయాన్ని గ్రామ టీడీపీ నాయకుడు రమణ మృతుడు తల్లికి సమాచారం అందించారు. వారు వచ్చి చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లి ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన జీసీసీ చైర్మన్


భువనేశ్వరిని కలిసిన శ్రావణ్‌కుమార్

పాడేరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరిని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ శుక్రవారం విశాఖలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతంలోని పలు అంశాలను ఆమె దృష్టికి తీసువెళ్లారు. అలాగే, ఆమెగతంలో తాను మన్యంలో పర్యటించిన అం శాలను గుర్తుచేసుకున్నట్టు జీసీసీ చైర్మన్ పేర్కొన్నారు.

సౌర శక్తి పథకాన్ని వినియోగించుకోవాలి


మర్రివాడలో సోలార్ విద్యుత్ వీధి దీపాలను ప్రారంభోత్సం

కొయ్యూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ఆదా కోసం అమలు చేస్తున్న సౌరశక్తి పథకాన్ని ప్రజ లు సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, టూరిజం డైరక్టర్ కిల్లు రమేశ్ నాయుడు సూచించారు. శుక్రవారం మండల పరిధి ఆదర్శ పంచాయతీ మర్రివాడలో రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సోలార్ లైటింగ్ స్కీం(సోలార్ వీధి దీపాలు)ను ఆయన ప్రారంబించారు. అలాగే వాటర్‌షెడ్డు పథకంలో 90 శాతం రాయితీపై సుమారు రూ. 50 లక్షలు విలువైన వాటర్ ఇంజన్లు, టార్పాలియన్లు, నాగలి సెట్లను రైతులకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలతో వివిధ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. వీటినిసద్వినియోగపర్చుకోవాలని గ్రామస్థులను కోరా రు. ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్డు పీవోతో పాటు టీడీపీనేతలు జి. సత్యనారాయణపాల్గొన్నారు.

ఆస్పత్రిలో ప్రసవాలు శ్రేయస్కరం


గర్భిణీనికి తనిఖీ చేస్తున్న స్త్రీవైద్యనిపుణులు వాసవి

చింతపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు విధిగా ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలని స్త్రీవైద్యనిపుణులు డాక్టర్ ఎస్.వాసవి అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రధాన మంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 190మంది గర్భిణులకు స్త్రీ వైద్యనిపుణులు వైద్యపరీక్షలు, అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తొమ్మిది నెలల్లో ఒక్కసారైన స్కానింగ్ చేయించుకోవాలన్నారు.దీని వల్ల ప్రమాదకరమైన ప్రసవాలను ముందుగా గుర్తించవచ్చునన్నారు. గర్భిణులు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకుంటూ పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రసవ సమయానికి పది రోజులు ముందుగా చింతపల్లి గర్భిణుల వసతి గృహంలో చేరాలన్నారు. గృహాల్లో ప్రసవం పొందడం తల్లి, బిడ్డ ఆరోగ్యానికి సురక్షితం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక పాల్గొన్నారు.

ముమ్మరంగా పసుపు సాగు పనులు


ఏ.కోడాపల్లిలో పసుపు నాటుతున్న గిరి మహిళలు

జి.మాడుగుల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపు సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొద్దిరోజులుగా వర్షాలు విస్తారంగా కురవడంతో పసుపు దొడ్లు దుగ్గిపనులు జోరందుకున్నాయి. వర్షాలకు పసుపు (భూమి) నేలలో పెరగడానికి అవకాశాలున్నట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మండలంలో ఏ గ్రామంలో చూసిన గిరిజన మహిళాలు పసుపు సాగు పనుల్లో నిమగ్నమై కనిపిస్తున్నారు. మండల పరిధిలో ఈ-క్రాప్ నమోదు ప్రకారం 5,177 ఎకరాల్లో పసుపు సాగులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి లకే పాత్రుడు తెలిపారు.

శాప్ చైర్మన్‌ను కలిసిన నేతలు


శాప్ చైర్మన్‌కు పుష్పగుచ్చం అందిస్తున్న తెలుగు యువత నేత సురేశ్‌కుమార్, తదితరులు

పాడేరు, మే 9 (ఆంధ్రజ్యోతి): అరకులోయ పర్యటనకు విచ్చేసిన శాప్ చైర్మన్ రవినాయుడును పాడేరుకు చెందిన తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీ సురేశ్‌కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు గిరిజన ప్రాంతంలో క్రీడాభివృద్ధికి కృషి చేయాలని అతనిని కోరినట్టు సురేశ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర, టీడీపీ నేతలు జి.పారిజాతం, సురేంద్రరాజు, శంకరనాయుడు, చంటి పాల్గొన్నారు.

చుక్కానిలేని జీవితాలు

» మత్స్యగెడ్డలో నాటుపడవలతో మత్స్యకారుల వేట » ప్రాణాలకు ముప్పు » వలలు, బోట్లు అందించాలని డిమాండ్


మత్స్యగెడ్డలో నాటు పడవపై చేపల వేటకు వెళ్తున్న సంప్రదాయ జాలర్లు

ముంచంగిపుట్టు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలో మత్స్యకారులు సంప్రదాయ చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సుజనకోట, పెదగూడ, దారెల, పనసపుట్టు, బూసిపుట్టు, రంగబయలు, లక్ష్మీపురం, బరడ, జోలాపుట్టు తదితర పంచాయతీల పరిధిలో నాటు పడవలతో వీరు వేట సాగిస్తుండడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాల్లో ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. వీరికి ప్రభుత్వ పరంగా ఎటువంటి సాయం అందడంలేదు. ఈ స్థితిలో తమకు రాయితీపై వలలు, బోట్లు అందించాలని వారంతా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు వలలు, బోట్లు అందిస్తామంటూ కాలయాపన చేస్తున్నారని వా రు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలలు, బోట్లను అందించకపోవడంతో ప్రస్తుతం వారు సొంతగా తయారు చేసుకున్న వలలు, నాటుపడవలను చేపల వేటకు ఉపయోగిస్తున్నారు. మత్స్యగెడ్డపై చేపల వేటకు నాటుపడవలను ఉపయోగించడంతో తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. చేపల వేటే జీవనాధారం కావడంతో ప్రాణాలకు తెగించి నాటు పడవలను వినియోగించక తప్పని దుస్థితి నెలకొంటోంది. అధికారులు తమ గ్రామాలను సందర్శించిన సమయంలో వలలు, బోట్లు రాయితీపై అందిస్తామని హామీ ఇచ్చారని, ఆ తర్వాత ఇటువైపు కన్నెతి చూడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వలలు, బోట్లు మంజూరు చేయాలని పలుసమావేశాల్లో అధికారులకు వినతులు అందించినా ఫలితం మాత్రం కానరావడంలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాయితీపై వలలు, బోట్లు అందించాలని వారు కోరుతున్నారు.

జ్వర బాధితులకు విధిగా రక్త పరీక్షలు: డీఎంవో


రోగులతో మాట్లాడుతున్న డీఎంవో తులసి

చింతపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో జ్వరబాధితు లు విధిగా రక్త పరీక్ష చేయించుకోవాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) తులసి అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆమె సందర్శించారు. వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో మలేరియా కేసుల రిజిస్ట్రర్లను పరిశీలించారు. ఏరియా ఆస్పత్రికి వస్తున్న మలేరియా బాధితులు, అందుబాటులోనున్న చికిత్సపై సూపరింటెండెంట్ ఇందిరా ప్రియాంకతో చర్చించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎపిడమిక్ సీజన్ ప్రారంభం కావడంతో గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతాయన్నారు. జ్వరం వచ్చిన వెంటనే బాధితులు రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. మలేరియా నిర్ధారణ పరీక్షల కు ఆశ కార్యకర్త వద్ద కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే సకాలంలో ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలన్నారు. మలేరియాను నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రస్తుతం మలేరియా కేసులు నమోదైన గ్రామాల్లో దోమల మందు పిచికారి చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సత్యనారాయణ, ఏఏఎంవో నీలకంఠం, చింతపల్లి, సీలేరు సబ్‌యూనిట్ అధికారులు బుక్కా చిట్టిబాబు, ఆర్. కన్నబాబు, ఎంటీఎస్ యుగంధర్ పాల్గొన్నారు.

సర్కార్ బడులను కాపాడాలి

» ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నాలో ఏపీటీఎఫ్ నాయకులు


ఐటీడీఏ ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పాడేరురూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సర్కారు బడులను కాపాడాలని ఏపీటీఎఫ్ జిల్లా సబ్ కమిటీ సభ్యులు డి.సన్యాసిరావు, వి.రామారావు, బి. చిన్నారావు, ఎస్.శాంతకుమారి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు కె.పోతురాజు మాట్లాడుతూ ప్రభుత్వాల తీరుతో రాష్ట్రంలోని ప్రభుత్వ బడులు సంక్షోభంలో కూరుకుపోతున్నాయన్నారు. గత ప్రభుత్వం జీవో 117ను తీసుకువచ్చి విద్యారంగాన్ని అతలాకుతలం చేయగా, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే ధోరణిని అనుసరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తీరుమార్చుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానించాలని, 1 నుంచి 5 తరగతులు మోడల్ లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని, విద్యార్థుల సంఖ్యతో ప్రమేయం లేకుండా రెండు ఎస్‌జీటీ పోస్టులనుమంజూరు చేయాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా ఆవాస ప్రాంతాల్లో పాఠశాలలను ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు బకాయిలను తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఆర్.మోహనరావు, హుకుంపేట సంఘ మండలాధ్యక్షుడు ఎం.సత్యారావు, ప్రధాన కార్యదర్శి జి.కన్నారావు, అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ మండలాల నాయకులు ఎల్‌బీ.మంజునాథ్, ఎ.అద్దు, జి.ఈశ్వరరావు, ఎం.కొండబాబు, జి.రమ్యప్రియ, వి.స్వప్న, రత్నకుమారి, పార్వతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు


కల్వర్టు వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

డుంబ్రిగుడ, మే 9 (ఆంధ్రజ్యోతి): జైపూర్ జంక్షన్ అరకు పాడేరు ప్రధాన రహదారిలో ఎస్పీ ఆదేశాలపై పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. దీంతో పాటు బీడీ బృందం, డాగ్ స్క్వాడ్ రోడ్డుకు ఇరువైపులా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

జి.మాడుగుల, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలమామిడి పంచాయతీ వల్లంగుల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ రామకృష్ణ శుక్రవారం భూమిపూజ చేశారు. ఉపాధి నిధులు రూ. 8లక్షల తో ఈ పనులు చేపడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. రహదారి నిర్మాణం స్థానికుల రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు జి.అప్పారావు, నాయకులు పి. రాజుబాబు, ఎస్.చంటిబాబు, ఎం.సోలమోన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని సీఆర్టీల వినతి


గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణితో మాట్లాడుతున్న టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఈశ్వరి

పాడేరురూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ కారణాలతో రెగ్యులర్ కాని సీఆర్టీలు తమను కూడా రెగ్యులర్ చేయాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని కోరారు. అమరావతిలో శుక్రవారం మంత్రిని ప్రత్యేకంగా కలిసిన ఆమె పాడేరు నియోజకవర్గంలో సుమారు 86 మంది సీఆర్టీలను రెగ్యులర్ కాకుండా ఉన్నట్టు వివరించారు. గతంలో సీఆర్టీలను రెగ్యులర్ చేసిన సమయంలో వివిధ కారణాలు వల్ల తాము రెగ్యులర్ కాలేదన్నారు. తమకు న్యాయం చేయాలని మంత్రి సంధ్యారాణితో పాటు కమిషనర్ భార్గవిని కోరామన్నారు. వారిద్దరూ సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు.

కిశోర బాలికల వికాసంపై అవగాహన


మాట్లాడుతున్న అంగన్‌వాడీ సీడీపీవో లక్ష్మి

సీలేరు, మే 9, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మం డలం ధారకొండలో శుక్రవారం అంగన్‌వాడీ సీడీ పీఓ లక్ష్మీ ఆధ్వర్యంలో బాలికలకు (11నుంచి 18 ఏళ్ల) కిశోర్ వి కాసం అనే కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాలతో కలిగే అన ర్థాలు, ఈ వయసులో తలెత్తే ఆరోగ్య సమస్యలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూ పర్‌వైజర్ కృష్ణవేణి, మహిళా పోలీస్ పద్మ, రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు యశోదమ్మ, లక్ష్మి, కల్పన, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

'ఏకలవ్య' కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ పరిధిలోని జీకే వీధి, చింతపల్లి, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 2025-26లో లో చేరదలచిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఐటీడీఏ గురుకులసెల్ పాడేరులో దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ పీవో డాక్టర్. ఎంజే.అభిషేక్ గౌడ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో బాలురకు 79, బాలికలకు 61 సీట్లు ఖాళీలుయన్నారు. తెల్లరేషన్ కలిగి ఏడాదికి రూ. లక్ష ఆదాయం ఉన్న విద్యార్థులర్హులన్నారు. వివరాలకు కన్వీనర్ ప్రిన్సిపాల్ మూర్తి సెల్: 94937 58072, ఎంవీ రమణారావు 99085 95435 సంప్రదించాలన్నారు.

గంజాయితో ఒకరి అరెస్టు


నిందితుడితో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

జి.మాడుగుల, మే 9 (ఆంధ్రజ్యో తి): ఏడు కిలోల గంజాయితో ఒకరిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ షణ్ముఖరావు తెలిపారు. కె.కోడాపల్లి పంచాయ తీ జన్నేరు గ్రామంలో సోమెలి నూకరాజు ఇంట్లో గంజాయి ఉన్నట్టు సమాచారంతో గురువారం సో దాలు నిర్వహించినట్టు ఎస్‌ఐ చెప్పారు.గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టుచేసినట్టు వివరించారు. ఈ దాడిలో పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 18 కేంద్రాలు

పాడేరురూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఇంటర్ విద్యాధికారి ఎస్.భీమశంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు మొదటి సంవత్సర జనరల్ విద్యార్థులు 3,075, ఒకేషనల్ విద్యార్థులు 515 మంది, ద్వితీయ సంవత్సర జనరల్ విద్యార్థులు 1,564 మంది, ఒకేషనల్ విద్యార్థులు 267 మంది హాజరు కానున్నారని తెలిపారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం చిన్నారులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయన్నారు.

మావోయిస్టు నేత పండన్న మృతదేహం అప్పగించాలంటూ ఆందోళన


కొమ్ములవాడలో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

సీలేరు, మే 9 , (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు నాయకుడు, ఏవోబీ ఎస్‌జెడ్‌సీ సభ్యుడు కాకూరి పండన్న అలియాజ్ జగన్ మృతదేహాన్ని అతని కుటుంబ సభ్యులకు అప్పగించడంలో పోలీసులు జాప్యం చేస్తుండడంపై జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధి పండన్న స్వగ్రామం కొమ్ములవాడలో అతని కుటుంబసభ్యులు, గ్రామస్థులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగి మూడు రోజులవుతుందన్నారు. ఈ నేపథ్యంలో మృతి చెందిన పండన్న మృతదేహం కోసం గురువారం మధ్యాహ్నం నుంచి అతని సోదరుడు, మరదలు, ఇతర బంధువులు, రంపచోడవం ఆసుపత్రి వద్ద పడిగాపులు గాస్తున్నా, పోస్టుమార్టం నిర్వహించి మృతదేహం వారికి అప్పగించడంలో ఎందుకు తీవ్ర జాప్యం చేస్తున్నారంటూ పండన్న బంధువులు, గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రికే మృతదేహం కొమ్ములవాడ చేరుతుందని గ్రామస్థులు, బంధువులు ఎదురు చూశారు. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో కూడా మృతదేహం ఇంకా అప్పగించలేదన్న సమాచారంతో అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

» అరకు నియోజక వర్గ టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్


మాట్లాడుతున్న హర్షవర్ధన్

అరకులోయ, మే 9 (ఆంధ్రజ్యోతి): అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లోనూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్ సూచించారు. శక్రవారం స్థానిక టీటీటీ కల్యాణ మండపంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర అధ్యక్షతన ముఖ్య నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హర్షవర్ధన్ మాట్లాడుతూ, వర్గాలకు తావులేకుండా స్థానిక ఎన్నికల్లో కష్టపడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామాల్లో వివరించాలన్నారు. అరకు, పాడేరు నియోజవర్గాల పార్టీ ఇన్‌చార్జీలతో అభివృద్ధి పనులు చేయించుకోవాలన్నారు. సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లాలన్నారు.పార్టీ పరంగా క్రమశిక్షణతో మెలగాలన్నారు. దొన్నుదొర మాట్లాడుతూ అధిష్ఠానం ఆలోచనలకు అనుగుణంగా అందరం కష్టపడి పని చేయాలన్నారు. పలువురు నాయకులు పార్టీ సస్పెండ్ చేసిన వారిని, పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే వారిని అధిష్ఠానం ప్రోత్సహించకూడదన్నారు. సమావేశంలో పెదలబుడు, మాదల, బొర్రా సర్పంచ్‌లు, పలుమండలాల నాయకులు పాల్గొన్నారు.

భారత్ సైన్యానికి మద్దతుగా ర్యాలీ

ముంచంగిపుట్టు, మే 9 (ఆంధ్రజ్యోతి): పాక్ సరిహద్దు ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా భారత్ సైన్యానికి మద్దతుగా దారెల గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు.సర్పంచ్ పి.పాండురంగస్వామి ఆధ్వర్యంలో గ్రామస్థులు జాతీయ జెండాలను చేతపట్టుకుని వీధుల్లో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదం అంతం కావాలని, భారత ఆర్మీ విజయ కేతనం ఎగరవేయాలని అన్నారు. యుద్ధంలో అమరులైన భారత్ సైనికులకు ఘన నివాళులర్పించారు.

క్రీడా పాఠశాలలో సామగ్రి కోసం రూ.5 లక్షల మంజూరు



మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

అరకులోయ, మే 9 (ఆంధ్రజ్యోతి):అరకులోయ గురుకుల క్రీడా పాఠశాలకు క్రీడా సామగ్రికి రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి యూత్‌ట్రైనింగ్‌సెంటర్‌లో కొనసాగుతున్న ఈ క్రీడాపాఠశాలను ఆయన సందర్శించారు. ప్రిన్సిపాల్‌తో విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొరతో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దత్తత తీసుకున్న సమయంలో పెదలబుడు పంచాయతీ పరిధిలో ఉన్న అరకులోయలో రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలను మంజూరు చేశారన్నారు. ఈ పాఠశాలకు అవసరమైన సొంత భవనాలు, క్రీడా మైదానాలకు నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పాఠశాలలో సమస్యలను ప్రిన్సిపాల్ పిఎస్ఎన్.మూర్తి శాప్ చైర్మన్‌కు వివరించారు. ఈ సమావేశంలో టీడీపీ ఎన్నికల పరిశీలకులు హర్షవర్ధన్, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాల ధర పెంపు

... 5వ పేజీ తరువాయి

పాలు లీటరు రూ.63 నుంచి రూ.66కు, హోమోజినైజ్డ్ టోన్డు పాలు (గంగ) అరలీటరు రూ.28 నుంచి రూ.29కు, డబుల్ టోన్డు పాలు (గంగ) రూ.26 నుంచి రూ.27కు పెంచింది.

కాగా టోన్డు పెరుగు 180 గ్రాముల ప్యాకెట్ రూ.14 నుంచి రూ.15కు, 900 గ్రాముల ప్యాకెట్ రూ.54 నుంచి రూ.56కు, కేజీ ప్యాకెట్ రూ.64 నుంచి రూ.66కు పెంచారు. పెరిగిన ధరలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి.

రూ.10 లక్షలకు పైగా భారం

విశాఖ డెయిరీ ప్రతిరోజు సుమారు 5 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తుండడంతో డెయిరీ పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వినియోగదారులపై రోజుకు సుమారు రూ.10 లక్షల మేర అధిక భారం పడుతుందని అంచనా వేస్తున్నారు.

ఎలమంచిలిలో వైసీపీకి ఎదురుదెబ్బ

... 5వ పేజీ తరువాయి

ఈ విషయాన్ని శుక్రవారం మీడియాకు వెల్లడించారు.

నోటీసుపై సంతకాలు చేసిన సభ్యులు

చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, టీడీపీకి చెందిన మజ్జి రామకృష్ణ (23వ వార్డు), ఇండిపెండెంట్ సీరా సాయి ప్రసన్న (8వ వార్డు), వైసీపీకి చెందిన పందూరి హరనాథ్ (2వ వార్డు), తుంపాల శ్రీనివాసరావు (3వ వార్డు), ఆడారి పార్వతి (6వ వార్డు), కట్టమూరి సుజాత (7వ వార్డు), మంజేటి అప్పల కొండమ్మ (10వ వార్డు), చాగంటి రాజు (14వ వార్డు), మైచర్ల కిరణ్ (16వ వార్డు), రాయి భార్గవి(18వ వార్డు), సుంకరి మరిణేశ్వరరావు (24వ వార్డు) ఆర్‌డీఎస్‌జీటీ కొండలరావు (25వ వార్డు), ఈరిగెల గణేశ్ (15వ వార్డు), పడాల కావ్య (17 వార్డు), పిట్టా సత్తిబాబు (19వ వార్డు).

రాజీనామా ఆలోచనలో వైస్‌చైర్మన్లు?

మునిసిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యేతో కలుపుకుని మొత్తం 26 మంది వున్నారు. వైస్‌చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 2/3 వంతు మంది.. అంటే 17 మంది సభ్యులు అవసరం. అవిశ్వాస నోటీసుపై 16 మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారు. ఎమ్మెల్యేతో కలుపుకుంటే 17 మంది అవుతారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గడం, వైస్‌చైర్మన్లను పదవి నుంచి దించడం ఖాయమని చైర్‌పర్సన్ వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో ముందుగానే రాజీనామా చేయాలని వైస్‌చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరైపు నాగ త్రినాథ గుప్తా యోచిస్తున్నట్టు తెలిసింది. అయితే పార్టీ పెద్దలతో మాట్లాడిన తరువాత తుది నిర్ణయం తీసుకుంటామని వైస్‌చైర్మన్ నాగత్రినాథ ఈశ్వరగుప్తా చెబుతున్నారు.

కిలేడీ

... 5వ పేజీ తరువాయి

రిజిస్ట్రేషన్ల శాఖలో సబ్ రిజిస్ట్రార్లకు అడ్డగోలు ఆదాయం వస్తుందని గ్రహించి, కీలకమైన స్థానాల్లో ఉన్నవారిని 'ఏసీబీ' పేరుతో బెదిరించి స్వర్ణలత భారీ వసూళ్లకు పాల్పడుతున్నారు. తాజాగా మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఏసీబీ సీఐగా వెళ్లి దొరికిపోయిన బలగా సుధాకర్ ఆమె బృందంలో మనిషేనని బయటపడింది. నకిలీ సీఐ సుధాకర్...'ఉన్నతాధికారితో మాట్లాడండి' అంటూ స్వర్ణలతకు ఫోన్ చేయడంతో ఆమె గుట్టు రట్టయింది. తొలుత ఆమెను తప్పించాలని కొందరు పెద్దలు యత్నించారు. కానీ అప్పటికే సమాచారం లీక్ కావడం, పత్రికల్లో ఆమె వివరాలు రావడంతో అరెస్టు చేయక తప్పలేదు. ఆమె ఫోన్ కాల్ లిస్ట్‌లో పలు శాఖలకు చెందిన కొందరు అధికారుల నంబర్లు ఉన్నట్టు గుర్తించారు. వారితో రెగ్యులర్‌గా సంభాషిస్తున్నట్టు తెలిసింది. అందులో కొందరు అధికారులు ఆమెను ప్రత్యేకంగా కలవడానికి ప్రతి నెలా పని గట్టుకొని విజయవాడ వెళుతున్నట్టు ఆయా శాఖల సిబ్బంది గుసగుసలాడుతున్నారు. సాధారణంగా తహశీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు ప్రతి నెలా విజయవాడ వెళ్లి ఉన్నతాధికారులను కలవాల్సిన అవసరం ఉండదు. కానీ వారు వెళుతున్నారంటే ఏదో ఉందని అనుమానిస్తున్నారు.

జీవీఎంసీ జోన్-2లో ఏమి జరిగిందో...?

మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లడానికి ముందు నకిలీ ఏసీబీ సీఐ బలగ సుధాకర్ జీవీఎంసీ జోనల్-2 కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ వారు అనుకున్న విధంగా పని పూర్తయినట్టు తెలిసింది. అక్కడ ఎంత పుచ్చుకున్నారు?, ఎవరు ఇచ్చారు?...అనేది బయటకు రానివ్వడం లేదు. ఏసీబీ అధికారులు స్వర్ణలత కేసును మరింత పకడ్బందీగా విచారణ చేసి, అసలు ఇప్పటివరకూ ఎంతమందిని బెది రించారు?, ఏ మేరకు వసూలు చేశారనే వివ రాలు వెలికితీయాలి. అదేవిధంగా భవిష్యత్తులో ఇలాంటి వ్యవహారాలకు పాల్పడకుండా చూడాలి.

ప్రయాణికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

» ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు



అనకాపల్లి టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆర్టీసీ అనకాపల్లి డిపో మేనేజర్ ఎల్.వెంకటేశ్వరరావు తెలిపారు. డీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆర్టీసీ విజయవాడ ప్రధాన కార్యాలయంలో సివిల్ ఏఈగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడి డీఎంగా బదిలీ చేశారు. ప్రస్తుతం డిపోలో ఉన్న అంశాలపై అవగాహన చేసుకుంటున్నట్టు చెప్పారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. అనకాపల్లి నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఇప్పటి వరకు నడపక పోవడానికి గల కారణాలపై అధ్యాయనం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అలాగే వర్షాలు పడితే ఆర్టీసీ కాంప్లెక్స్ అంతా చెరువును తలపించేలా మారుతుందని ఆయన దృష్టికి తీసుకు వెళ్లగా, కాంప్లెక్స్‌కు సంబంధించిన మ్యాప్‌ను ఇప్పటికే తీసుకోవడం జరిగిందన్నారు. కాంప్లెక్స్‌కు ఆనుకొని ఉన్న డ్రైనేజీ వల్ల వర్షాలు పడే సమయంలో నీరుపారే మార్గం లేక ఈ పరిస్థితి ఎదురవుతున్నట్టు చెప్పారు. ఈ విషయమై జీవీఎంసీ జోనల్ కమిషనర్, శానిటేషన్ విభాగం అధికారులతో మాట్లాడి కాలువల్లో పూడికలను తీయించి, భవిష్యత్తులో కాంప్లెక్స్‌లో నీరు నిలువకుండా చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

నూకాంబికను దర్శించుకున్న దర్శకుడు రామ్



అమ్మవారిని దర్శించుకుంటున్న సినీ దర్శకుడు రామ్ గోదల

అనకాపల్లి టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నూకాంబిక అమ్మవారిని సినీ దర్శకుడు రామ్ గోదల శుక్రవారం దర్శించుకున్నారు. 'ఓ భామ అయ్యో రామా' చిత్రం జూన్‌లో విడుదలవుతున్న సందర్భంగా ఆలయానికి విచ్చేసి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆయన వెంట గంగాధర్, పొలిమేర ఆనంద్, ఎస్. భాను చందర్ ఉన్నారు.

నేత్రపర్వంగా సోమలింగేశ్వర, అమ్మవారి కల్యాణం



సోమలింగేశ్వర, బాలా త్రిపురసుందరీ దేవీ కల్యాణానికి హాజరైన భక్తులు

సబ్బవరం, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం లింగాలతిరుగుడు సోమలింగేశ్వర దేవస్థానంలో శుక్రవారం రాత్రి స్వామివారు, బాలాత్రిపుర సుందరీదేవిల వార్షిక కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. తొలుత అర్చకులు డి.శేఖర్ బృందం విశేష పూజలు జరిపిన అనంతరం స్వామి, అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిపై ఉంచారు. అనంతరం వేదండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ఈ వేడుకను కన్నులారా వీక్షించి తరించారు. ఈ సందర్భంగా భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తల నేపథ్యంలో భారత్ విజయం సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బీవీఎస్ఎస్ మురళీ, చైర్మన్ దాడి శివ సత్యనారాయణ, సర్పంచ్ దాడి లావణ్య, గ్రామ పెద్దలు దొడ్డి ప్రకాశరావు, దాడి కన్నంనాయుడు, రాజుకోటి, సత్తిబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దివ్యాంగులకు మెగా డీఎస్సీపై శిక్షణ

అనకాపల్లి కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీకి అర్హులైన దివ్యాంగ అభ్యర్థుల కోసం ఉచిత మెగా డీఎస్సీ క్రాష్ కోర్సు శిక్షణను విజయవాడలో నిర్వహించనున్నట్టు విభిన్నప్రతిభావంతుల శాఖ జిల్లా సహాయ సంచాలకులు బి.ఆసయ్య శుక్రవారం తెలిపారు. ముఖ్యంగా దృష్టి లోపం, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ దివ్యాంగులై ఎస్‌జీటీ టీచర్ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల కోసం విజయవాడలో ఉచితంగా శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 40 శాతం దివ్యాంగత్వం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీలోగా ఎండీఎస్‌టీ.ఏపీఈఎఫ్ఎస్ఎస్. ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సూచించారు. టెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక బోధనా పద్ధతిలో శిక్షణ, స్టడీ మెటీరియల్ పంపిణీ, ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. అర్హులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

వంద మందికి కంటి వైద్య పరీక్షలు



రోగులకు కంటి పరీక్షలు జరుపుతున్న వైద్య సిబ్బంది

తుమ్మపాల, మే 9 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తుమ్మపాలలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు వంద మందికి వైద్య సిబ్బంది కంటి పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు మాట్లాడుతూ తుమ్మపాల పంచాయతీ పరిధిలో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ పరీక్షలు జరిపిన వారిలో అవసరమైన వారికి ఉచింతంగా ఆపరేషన్లు చేయించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మాకవరపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూటిపాలలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపిన వివరాలివి. మాకవరపాలేనికి చెందిన లంక గణేశ్ (26) అనే యువకుడు ఐదేళ్ల కిందట తూటిపాల గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. కొంతకాలం వీరి దాంపత్య జీవనం సాఫీగా సాగినప్పటికీ మూడేళ్లుగా వీరిద్దరి మధ్య చిన్నచిన్న తగాదాలు జరుగుతూనే ఉండేవి. ఆరు నెలల కిందట భార్య తన కుమారుడ్ని తీసుకుని తూటిపాలలో ఉన్న కన్నవారింటికి వెళ్లిపోయింది. దీంతో గణేశ్ తీవ్ర మనస్థాపం చెంది ఉండేవాడు. గురువారం రాత్రి తన తల్లి నూకరత్నంకు తూటిపాల వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. అత్తవారింట ఏం జరిగిందో గానీ శుక్రవారం ఉదయం ఆ గ్రామానికి కొంత దూరంలో అత్తవారికి చెందిన జీడితోటలో జీడి చెట్టుకు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. ఈ విషయాన్ని గ్రామ టీడీపీ నాయకుడు రమణ మృతుడు తల్లికి సమాచారం అందించారు. వారు వచ్చి చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లి ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

» బాలికా సాధికారతకు సింహాద్రి ఎన్టీపీసీ చేస్తున్న కృషి అభినందనీయం » హోం మంత్రి వంగలపూడి అనిత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి అనిత, చిత్రంలో ఎమ్మెల్యే పంచకర్ల, సింహాద్రి ఈడీ సమీర్ శర్మ

పరవాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక బాధ్యతలో భాగంగా ఇక్కడి దీపాంజలి నగర్‌లోని శకుంతల ఆడిటోరియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జెమ్ 2025 (బాలికా సాధికారత) కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా శక్తి దేశం అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థి దశలోనే బాలికలకు బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు పిల్లలను దూరంగా ఉంచడంతో పాటు చట్టాలపై వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాలికా సాధికారతకు సింహాద్రి ఎన్టీపీసీ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం చేస్తున్న కృషి అమోఘమన్నారు. అనంతరం హోం మంత్రి చేతుల మీదుగా స్వప్నాల విమానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. సింహాద్రి ఈడీ సమీర్‌శర్మ, దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు నీతాశర్మ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, సింహాద్రిలోని వివిధ విభాగాల జీఎంలు, ఏజీ ఎంలు, దీపికా లేడీస్‌క్లబ్ ప్రతినిధులు, సీఎస్ఆర్ అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి

» టీడీపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద



కార్యకర్త నుంచి వినతులు స్వీకరిస్తున్న పీలా గోవింద, సురేంద్ర

అనకాపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకులు, కార్యకర్తల సమస్యల పరిష్కారానికే ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఇక్కడి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రతో కలిసి కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం పట్టణంలోని 80వ వార్డు టీడీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గణేశ్, టీడీపీ సీనియర్ నాయకులు కర్రి బాబి, జోగినాయుడు, బి.శ్రీనివాసరావు, శ్రీను, సూరిబాబు, భాను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

» పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోపీనాథ్

సబ్బవరం, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ డిమాండ్ చేశారు. ఇక్కడి ఎంఆర్‌సీ భవనంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. త్వరలో చేపట్టే బదిలీలను మాన్యువల్ పద్ధతిలో జరపాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలని, రిటైర్మెంట్‌కు మూడేళ్ల లోపు సర్వీసు ఉన్న ఉపాధ్యాయులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అలాగే, ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఉన్నత పాఠశాలల్లో 1:40 రేషియోలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక పాఠశాలల్లో 20 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులను తప్పనిసరిగా నియమించాలని, మోడల్ ప్రైమరీ స్కూల్‌కి ప్రధానోపాధ్యాయులుగా సీనియర్ ఎస్‌జీటీలను పీఎస్‌హెచ్‌ఎంలుగా నియమించాలని, పెండింగ్ బకాయిలు, సరెండర్ లీవ్, డీఏ ఎరియర్స్ వెంటనే విడుదల చేయాలని, మధ్యంతర భృతి ప్రకటించాలని, పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి వనం భాస్కరరావు, రాష్ట్ర కార్యదర్శి అడిగర్ల సత్యంనాయుడు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కేవీ రమణ, మాడుగుల అధ్యక్షుడు ఆనంద్, జిల్లా కార్యదర్శి డెక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల సత్వర పరిష్కారమే మండల సమన్వయ కమిటీ లక్ష్యం

» మండల ప్రత్యేకాధికారిణి లక్ష్మీసుభాషిణి



బాధితుల సమస్యలు వింటున్న ప్రత్యేకాధికారిణి

కశింకోట, మే 9 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల సత్వర పరిష్కారమే మండల సమన్వయ కమిటీ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారిణి వి.లక్ష్మీసుభాషిణి అన్నారు. శుక్రవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన మండల సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఉగ్గినపాలెం, అచ్చెర్ల, కశింకోట, తీడ గ్రామాల్లో భూముల సమస్యలను సంబంధిత బాధితుల ద్వారా తెలుసుకుని పరిష్కారం చూపాల్సిందిగా ఆయా అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.వి.రవికుమార్, సీఐ అల్లు స్వామినాయుడు, డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామిలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

పరవాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పరవాడ డీఎస్పీ వల్లెం విష్ణుస్వరూప్ సూచించారు. మండల కేంద్రం పరవాడ సంతబయలు వద్ద శుక్రవారం రాత్రి సైబర్ నేరాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులను ఇంట్లో ఉంచరాదన్నారు. అపరిచిత వ్యక్తులు కంట పడితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. షాపుల వద్ద యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐ బి.కృష్ణారావు, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, స్థానిక నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పోతల అప్పలనాయుడు, పైలా రామచంద్రరావు, రెడ్డి నాయుడు, పైలా అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధంలో భారత్ జవానులకు మంచి జరగాలని పూజలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ శ్రేణుల పూజలు

కొత్తూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : భారత్- పాక్ యుద్ధంలో భారత జవానులకు మంచి జరగాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు గాంధీనగరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జై భారత్ మాతాకి జై, జయహో భారత్ అంటూ.. నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సహకార సంఘాల్లో ఆన్‌లైన్ ప్రోగ్రామింగ్‌పై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా కో- ఆపరేటివ్ అధికారిణి ప్రేమ స్వరూపారాణి

కశింకోట, మే 9 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల్లో ఆడిటింగ్ అధికారులు, సిబ్బందికి ఆన్‌లైన్ ప్రోగ్రామింగ్‌పై ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా కో-ఆపరేటివ్ అధికారిణి ఎ.ప్రేమ స్వరూపారాణి, ఎలమంచిలి డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారిణి పి.ఎస్.ఎల్.కిరణ్‌కుమారి, డీపీడీఎం శ్రీవిద్యలు మాట్లాడుతూ ఈఆర్పీ సైన్- ఆఫ్‌ను శతశాతం విజయవంతంగా పూర్తిచేసినందుకు పీఏసీలు, సీఈవోలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆన్‌లైన్ ప్రోగ్రామింగ్‌లో అనకాపల్లి జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచినట్టు చెప్పారు. సహకార సంఘాల ఆడిట్‌ను ఈ-ఆడిట్ ప్రక్రియలో పూర్తిచేయాలన్నారు. పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ పూర్తయినందున రైతులకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుతాయని వివరించారు.

'జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజుల పనిదినాలు'



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కశింకోట, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలుత ఈ పనులను టీడీపీ గ్రామ అధ్యక్షుడు తాకాశి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వందరోజుల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సిదిరెడ్డి శ్రీను, పెంటకోట రాము, నడిపల్లి సన్యాసిరావు, బొబ్బిలి పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించాలని వినతి

తుమ్మపాల, మే 9 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి సాగిస్తున్న వ్యాపారాలను తక్షణమే తొలగించాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో వాహనాల రద్దీ బాగా పెరిగిందన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కొంతమంది వ్యాపారాలు సాగిస్తుండడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నట్టు చెప్పారు. దీంతో ఫుట్‌పాత్‌లపై నడవాల్సిన పాదచారులు రోడ్లపై నడుస్తూ తీవ్ర అవస్థలు పడుతున్నారని, చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతున్నారని వాపోయారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నా జీవీఎంసీ, పోలీస్ అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించడంతో పాటు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ఆయన కోరారు.

మామిడి తోట మీదుగా రోడ్డు వేశారు : మహిళ ఆరోపణ

అనకాపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎస్.రాయవరం మండలం జేవీపాలెం గ్రామ సర్పంచ్ భర్త తనకు చెందిన మామిడి తోట మీదుగా రోడ్డు వేశారని ఓ మహిళ ఆరోపిస్తూ శుక్రవారం వీడియో విడుదల చేసింది. జేవీపాలేనికి చెందిన అన్నం కాంతం 2016 నుంచి తనకు చెందిన మామిడి తోట ధ్వంసం చేశారంటూ పోరాడుతున్నట్టు తెలిపింది. ప్రస్తుత గ్రామ సర్పంచ్ భర్త తనకు చెందిన మామిడి తోటను ధ్వంసం చేసి, రేకుల షెడ్డును తొలగించారని వాపోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక ఓ ప్రజాప్రతినిధి అండతో మరింత రెచ్చిపోతున్నాడని పేర్కొంది. గతంలో ఈ విషయమై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయింది.

వడదెబ్బతో మాజీ సర్పంచ్ మృతి

బుచ్చెయ్యపేట, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్టిదొరపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ బొబ్బిలి చిన అప్పారావు శుక్రవారం వడదెబ్బకు గురై మృతిచెందారు. పొలంలో పనిచేస్తుండగా ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి గుండెల్లో నొప్పి వచ్చిందని కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా, అక్కడి కన్నుమూసినట్టు చెప్పారు. ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు.

మురళీనాయక్ మృతి విషాదకరం

» స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో పాకిస్తాన్ సైనికుల బాంబు దాడిలో శ్రీసత్య సాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళీనాయక్ మృతి చెందడం పట్ల స్పీకర్ అయ్యన్నపాత్రుడు శుక్రవారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం విషాదకరమన్నారు. ఆయన ప్రాణత్యాగం దేశ ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారన్నారు. మురళీ నాయక్ కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. యుద్ధంలో సైనికుల ధైర్య సాహసాలు అమోఘమన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509